ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 3 ఏప్రిల్ 2025



ఈ నెల 4న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి సందర్భంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ్‌రెడ్డి బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని బూత్, మండల స్థాయిలో నిర్వహించాలని రాష్ట్ర పార్టీ పిలుపు నిచ్చిందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ పాల్గొంటారన్నారు. 4న గోదావరిఖని సరస్వతి శిశు మందిర్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

- వన్యప్రాణులకు తాగు నీటి కోసం 23 సాసర్ పిట్లు
- జిల్లా సరిహద్దులు దాటిన పులి
- జిల్లా అటవీ శాఖాధికారి శివయ్య

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



పెద్దపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో అగ్ని ప్రమాదాలను నివారించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, వేసవిలో వన్యప్రాణులను రక్షించేందుకు సాసర్ పిట్లలో తాగు నీటిని అందుబాటులో ఉంచుతున్నామని, పులి జిల్లా సరిహద్దులు దాటిపోయిందని జిల్లా అటవీ శాఖాధికారి శివయ్య తెలిపారు. బుధ వారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు..

ఆంధ్రజ్యోతి: జిల్లాలో అడవులు ఎంత శాతం ఉన్నాయి?

డీఎఫ్‌ఓ: జిల్లాలో 14.20 శాతం 76,938 ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. పెద్దపల్లి డివిజన్‌లో 39,230 ఎకరాలు, మంథని డివిజన్‌లో 37,707 ఎకరాల్లో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: హరిత హారం కార్యక్రమాల ద్వారా ఎంత మేరకు అడవులు పెరిగాయి?

డీఎఫ్‌ఓ: ఇప్పటి వరకు పది విడతల్లో హరిత హారం కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించింది. ప్రతి ఏటా 30 నుంచి 50 లక్షలకు పైగా జిల్లాలో 5 కోట్ల వరకు మొక్కలను నాటడం జరిగింది. వాటి ద్వారా 7 శాతం వరకు అటవీ విస్తీర్ణం పెరిగింది. ఇంకా 12 శాతం అడవులు పెరగాలి

ఆంధ్రజ్యోతి: వచ్చే వర్షాకాలం నాటికి ఎన్ని మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టారు?

డీఎఫ్‌ఓ: అటవీ శాఖ, డీఆర్‌డీఓ నర్సరీల ద్వారా 30 లక్షల మొక్కల పెంచేందుకు లక్ష్యం విధించారు. ఆ మేరకు మొక్కలను పెంచుతున్నాం. వర్షాకాలంలో వర్షాలు పడగానే నాటుతాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో పులి జాడలు కనబడుతున్నాయి కదా?

డీఎఫ్‌ఓ: అవును. నెల రోజుల క్రితం మంథని, ముత్తారం ప్రాంతంలోని అటవీ ప్రాంతాల్లో పులి అడుగు జాడలను గుర్తించి ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశాం. ప్రస్తుతం పులి జిల్లాలో లేదు. సరిహద్దులు దాటి ఇతర ప్రాంతాలకు వెళ్లి పోయింది.

ఆంధ్రజ్యోతి: వేసవిలో వణ్యప్రాణులు సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారా?

డీఎఫ్‌ఓ: ఇప్పటి వరకు జిల్లాలోని అడవుల్లో 23 సాసర్ పిట్లు ఉన్నాయి. వణ్యప్రాణులు నీళ్ల తాగేందుకు వాటిలో నీళ్ల సిద్ధంగా ఉన్నాయి. ఎప్పటికప్పుడు వాటిని సిబ్బంది పర్యవేక్షిస్తు న్నారు.

ఆంధ్రజ్యోతి: తునికాకు సేకరణ ఎలా సాగుతున్నది.?


డీఎఫ్‌ఓ: తునికాకు సేకరణ కోసం ఏడు యూనిట్లలో టెండర్లను పిలిచాం. కాంట్రాక్టర్ల నుంచి పెద్దగా స్పందన లేదు. కేవలం రెండు యూనిట్లు ఖమ్మంపల్లి, ముత్తారం ఏ యూనిట్లలో మాత్రమే కాంట్రాక్టర్లు తునికాకు సేకరణ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: అటవీ భూములు కబ్జాకు గురైతే చర్యలు తీసుకుంటున్నారా?

డీఎఫ్‌ఓ: గత ప్రభుత్వ హయాంలో కొంత మంది పోడు భూములకు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో అర్హులైన ఐదుగురిని గుర్తించి ఒక ఎకరం 39 గుంటల భూమికి పట్టాలు ఇచ్చాం. కొత్తగా ఎవరు కూడా అటవీ భూములను ఆక్రమించడం లేదు. ఎక్కడైనా ఆక్రమించినట్లు తమ దృష్టికి వస్తే వెంటనే చర్యలు చేపడతాం.

ఎల్‌ఆర్‌ఎస్‌కు మరో అవకాశం

- జిల్లాలో 25,524 దరఖాస్తులకు 18,713 దరఖాస్తుల ఆమోదం
- ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్న 4,892 మంది పట్టాదారులు
- సమకూరిన రూ. 17.45 కోట్ల ఆదాయం
- నెలాఖరు వరకు గడువు.. విస్తృత ప్రచారం చేయాలని అధికారుల నిర్ణయం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఇరవై ఐదు శాతం రాయితీ ప్రకటించినా ప్రభుత్వం ఆశించిన మేరకు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకు రాకపోవడంతో ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు పెంచింది. బుధవారం నాటికి జిల్లాలో 4,892 మంది తమ ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించారు. తద్వారా ప్రభుత్వానికి 17 కోట్ల 45 లక్షల 25 వేల రూపాయల ఆదాయం సమకూరింది. ఇతర జిల్లాలతో పోలిస్తే పెద్దపల్లి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ శాతం పెరిగింది. అనధికారిక లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను మార్చి నెలాఖరు వరకు క్రమబద్ధీకరించుకుంటే ఫీజులో 25 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆశించిన మేరకు దరఖా స్తుదారుల నుంచి స్పందన రాకపోవడంతో ప్రభుత్వం రాయితీ గడువును ఈ నెలాఖరు వరకు గడువు పెంచడంతో మరికొంత మంది ముందుకు వచ్చే అవకాశా లున్నాయి. సాంకేతిక సమస్యల వల్ల కొంత మంది ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించలేక పోయా రు. స్పందన అంతంత మాత్రంగానే ఉంది. అధికార యంత్రాం గం చేస్తున్న విస్తృత ప్రచారం వల్ల ఇప్పుడిప్పుడే దరఖాస్తుదారుల్లో అవగాహన కలుగుతున్నది. రాయితీ గడువు తేదీని ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తేనే ఖజానా నిండే అవకాశాలు న్నాయి. జిల్లా వ్యాప్తంగా వచ్చిన 25,514 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 4,892 మంది తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు రుసుం చెల్లించారు. 17 కోట్ల 45 లక్షల 25 వేల రూపాయల రుసుం చెల్లిం చారు. జిల్లాలో వచ్చిన దరఖాస్తుల్లో పంచాయతీల్లో 5,731 దరఖాస్తులు రాగా, 4,893 దరఖాస్తులకు అధికారులు ఆమో దం తెలపగా, 1,068 ఎల్‌ఆర్‌ఎస్‌కు మరో అవకాశం మంది 38 లక్షల 25 వేల రూపాయల ఫీజు చెల్లించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో 7,083 దరఖాస్తులకు, 4,187 దరఖాస్తులను ఆమోదించగా, 3,239 మంది 6 కోట్ల 9 లక్షల రూపాయల రుసుం చెల్లించారు. మంథని మున్సిపాలిటీలో 895 దరఖా స్తులను 732 దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. 214 మంది 65 లక్షల రూపాయల రుసుం చెల్లిం చారు. పెద్దపల్లి మున్సి పాలిటీలో 10,278 దరఖాస్తులకు, 7,745 ఆమోదం తెలిపారు. 2466 మంది 9 కోట్ల 48 లక్షల రూపాయల రుసుం చెల్లించారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీలో 1,537 దరఖాస్తులకు 1,156 ఆమోదం తెలిపారు. 196 మంది 85 లక్షల రూపాయల రుసుం చెల్లించారు.

● అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నింపడం కోసం ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ రుసుంలో 25 శాతం రాయితీ ప్రకటించి ప్రచారం మిగతా 8వ పేజీలో..

నాణ్యమైన ఆహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): క్యాంటీన్‌కు వచ్చే కస్టమర్లకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈశ్వర ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద వివిధ యూనిట్ల స్థాపనకు సహకారం అందిస్తుందని, ఇందులో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్లో క్యాంటిన్ నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించామని తెలిపారు. వ్యాపార దృక్పథంతో క్యాంటిన్ నడపాలని, నాణ్యత అంశంలో ఎక్కడ రాజీ పడవద్దని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, ఏ.ఓ. శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

పెద్దపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ యాసంగి సీజన్‌లో ఎలాంటి కోతలు లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయరమణారావు అన్నారు. బుధవారం పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి పంట కాపాడేందుకు వీలుగా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు ముందు వచ్చిన రైతులకు ముందుగానే కాంటా పెట్టాలని అన్నారు.

పెద్దపల్లి జిల్లాలో ఎక్కడ కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్ల జరగాలని అన్నారు. ప్రభుత్వం నుంచి రైస్ మిల్లులకు ఎటువంటి పెండింగ్ అంశాలు లేకుండా సాధించే దిశగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటలలోగా డబ్బులు పడాలని ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ధాన్యం తరలింపు సమయంలో కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీ సమస్యలు రాకుండా ముందస్తుగా ప్లానింగ్ చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు అలాట్ చేసిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించాలని కలెక్టర్ సూచించారు. గతం కంటే ఈ సారి అధికంగా ధాన్యం దిగుబడి వస్తుందని, 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా ఉందని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన 24 గంటలలో ధాన్యం తరలింపు జరిగేలా చూడాలన్నారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా సన్న రకం ధాన్యం ధ్రువీకరణ చేసి కొనుగోలు కేంద్రం మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సన్న రకం వడ్లు రాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు, పక్కన కలెక్టర్ శ్రీహర్ష , అధికారులు

మొదలైన వరి కోతలు

- వర్ష సూచనతో రైతుల్లో ఆందోళన
- పచ్చి ధాన్యం విక్రయిస్తున్న రైతులు



ఓదెల శివారులో వరికోతలు

ఓదెల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వరినాట్లు ముందుగా వేసిన వరి రైతులు కోతలు మొదలు పెట్టారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో మిల్లులకు ధాన్యం విక్రయిస్తున్నారు. మరో వైపు వర్షం వచ్చే సూచనలు కనిపించడంతో ఆందోళన చెందుతున్న రైతులు కోసిన వెంటనే. పచ్చి ధాన్యం మిల్లులకు విక్రయిస్తున్నారు. ఓదెల, గుండ్లపల్లి, గుంపుల, ఇందుర్తి తదితర గ్రామాల్లో హార్వెస్టర్లతో రైతులు వరి పంటలను కోయిస్తు న్నారు. డిసెంబర్, జనవరి నెలల్లో నాట్లు వేయడంతో సన్నరకం, దొడ్డు రకం వరి పంటలు కోత దశకు చేరుకున్నాయి. అలాగే మానేరు పరివాహక గ్రామాలతో పాటు డి 86 ఎస్సారెస్పీ కాలువ అలాగే బావుల ఆధారంతో సాగు చేసిన వరి పంటలు కోతకు వచ్చాయి. ఇటీవల వడగండ్ల వాన వల్ల పాల దశలో ఉన్న మొక్కజొన్న పంటలు దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. మళ్లీ వాతావరణం కేంద్రం వర్షాలు ఉన్నాయనే హెచ్చరికతో కోతలు పూర్తి చేసేందుకు పరుగులు తీస్తున్నారు. ఓదెల నుంచి హరిపురం బైపాస్ రోడ్డు ఇరు పక్కల్లో ఉన్న వరి పంటల కోతలు పూర్తి కావస్తున్నాయి. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొనడంతో, ప్రస్తుతం పూర్తి అయిన వరి పంటల ధాన్యాన్ని పంటల నుంచి నేరుగా సుల్తానాబాద్‌లోని కొన్ని మిల్లులకు తరలిస్తున్నారు. ముందుగా వేసిన వరి పంటల కోత ప్రారంభ దశలోనే కొందరు మిల్లర్లు మధ్యవర్తులను పంపించి, కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. మిల్లర్లు పచ్చి వడ్లను రెండు రకాలుగా విభజించి దొడ్డు రకం, సన్నరకం ధాన్యానికి ధరలు కేటాయిస్తున్నారు. ధాన్యంలో పచ్చటి వడ్ల గింజలు ఉంటే క్వింటాల్‌కు రూ. 1900 అలాగే నాణ్యతగా ఉంటే క్వింటాల్‌కు రూ.2100తో కొనుగోలు చేస్తుండడంతో, రైతులు కూడా మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. మరో రెండు వారాలు గడిచినట్లయితే క్వింటాలుకు రూ.2200 వరకు కొనుగోలు చేసే పరిస్థితి ఉంది. అలాగే సన్నరకం ధాన్యానికి రూ.2300 చొప్పున రైతులు విక్రయిస్తున్నారు. అలాగే మరో వారం వరకు మానేరు పరివాహక వరి పంటలన్నీ కోత దశకు చేరుకునే పరిస్థితి ఉంది. మండలంలో 13 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ సారి 10 కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేసే పరిస్థితి ఉంది. అలాగే పొత్కపల్లి సొసైటీ ఆధ్వర్యంలో గతంలో ధాన్య కొనుగోలు నిర్వహించిన దాని కంటే ఈ సారి కేంద్రాల సంఖ్య పెరగనున్నాయి. కానీ ఈ కేంద్రాలన్నీ వచ్చే నెల వరకు, లేక ఈ నెల చివరి వారంలో ప్రారంభమయ్యేలా ఉన్నాయి. దీంతో రైతులు వర్షాల బారిన పడకుండా పంటలను పూర్తి చేసుకొని పచ్చి ధాన్యాన్ని అమ్ముకునేందుకు సిద్ధపడుతున్నారు.

ప్రతిసారి పచ్చివడ్లను అమ్ముకుంటున్నాం

- కాటం మహేందర్, రైతు ఓదెల



సమయానికి కొనుగోలు కేంద్రాలు లేకపోయేసరికి ప్రతిసారి పచ్చివడ్లనే అమ్ముకుంటున్నాం. ధాన్యాన్ని ఆరబెట్టకపోవడంతో శ్రమ తగ్గుతుంది. ముందుగా నాటు వేసుకోవడంతో తొందరగా పంట పూర్తయింది. వర్షాలు ఉన్నాయని సమాచారం వస్తుండడంతో నష్టపోతానని భయంతో వరి పంటను కోయించి పచ్చి ధాన్యం అమ్ముకుంటున్నాం

పరీక్ష కేంద్రంలో విద్యార్థికి గాయం



విద్యార్థినికి ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యుడు

ఓదెల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాంసానిపల్లికి చెందిన దాంసాని ఇందు అనే ఎస్సెస్సీ విద్యార్థిని ఓదెల పరీక్ష కేంద్రంలో గాయపడింది. పరీక్ష కేంద్రం లోపలికి వెళ్తుండగా తలుపు తగలడంతో తలకు గాయమైంది. స్థానిక వైద్యుడు వెంకటేశ్వర్లు ప్రాథమిక చికిత్స చేశారు.

రామగుండం కమిషనరేట్‌లో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

నెల రోజుల పాటు ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు నిషేధం

కోల్‌సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్టు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ పేర్కొన్నారు. పోలీస్ కమిషనరేట్ 7(1), 2016 యాక్ట్, సిటీ పోలీస్ యాక్ట్ ఫస్ట్ సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, 1861 ప్రకారం ఏప్రిల్ 1వ తేది నుంచి మే 5వ తేదీ ఉదయం 6గంటల వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు, నిర్వహించకూడదని, ఏమైన కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే ముందస్తు పోలీస్ అనుమతి తీసుకోవాలన్నారు.

కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డీజేలు, డ్రోన్‌లపై నిషేధం మరో నెల రోజుల పాటు పొడిగించినట్టు కమిషనర్ పేర్కొన్నారు. డీజేల స్థానంలో మైక్‌సెట్లకు అనుమతులు ఇస్తామని, సంబంధిత ఏసీపీల నుంచి అనుమతి పొందాలని తెలిపారు.

ఆన్‌లైన్ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు

● విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ ద్వారా మధ్యాహ్న భోజన చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణ, విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డితో కలిసి మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లింపుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణ మాట్లాడుతూ ట్రెజరీ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లింపు ప్రక్రియ ఆలస్యం అవుతుందని, నేరుగా ఆన్‌లైన్ నుంచే మధ్యాహ్న బిల్లులు చెల్లించేందుకు గల అవకాశాలను విద్యాశాఖ పరిశీలిస్తుందని తెలిపారు. ఏప్రిల్ నెలలో పెద్దపల్లి, కొత్తగూడెం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రతిరోజు విద్యార్థుల హాజరు నమోదు చేసి క్షేత్రస్థాయిలో పంపాలని, వీటి ద్వారా విద్యార్థులు హాజరు నమోదు చేస్తూ బిల్లులు తయారీకి చర్యలు చేపడుతామని అన్నారు. రాష్ట్రంలో ముందస్తుగా పెద్దపల్లి, భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాలో ముందుగా ఒక మండలాన్ని ఎంపిక చేసుకుని, నెలరోజుల పాటు మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నభోజన బిల్లులను ఆన్‌లైన్ ద్వారా త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు.

పేద కుటుంబానికి చెందిన ఇంటిని కూల్చడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండగ రోజు పేద కుటుంబానికి చెందిన దేవరకొండ సత్యనారాయణ ఇంటిని పోలీసుల పహారాలో కూల్చివేయడాన్ని బీజేపీ మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెలవుదినం కూల్చివేతలు చేయరాదని స్పష్టమైన నియమాలు ఉన్నప్పటికీ ఎలా కూల్చారని ప్రశ్నించారు. ఇరువర్గాలతో మాట్లాడి, ఒప్పించి ఇంటి కూల్చివేతను ఆపవలసిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులపై ఉంటుందన్నారు. కోర్టు ఆదేశాలు లేకపోయినా కూల్చివేతకు సహకరించిన పోలీసు అధికారులపై సీపీ చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయం జరిగే వరకు బాధితులకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, నాయకులు పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, వెల్లంపల్లి శ్రీనివాసరావు, శిలివేరు ఓదెలు, బెజ్జంకి దిలిప్ కుమార్, శివంగారి సతీష్, శాతరాజు రమేష్, మహేందర్ యాదవ్, కొమిరిశెట్టి రమేష్, ముస్త్యాల సంతోష్, మోర మనోహర్ పాల్గొన్నారు.

రైల్వేబోర్డు మెంబర్‌గా శ్రీనివాస్



అనుమాస శ్రీనివాస్

అంతర్గాం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అను మాస శ్రీనివాస్ అలియాస్ జీన్స్ సికింద్రాబాద్ డివిజన్ రైల్వే బోర్డు (డీఆర్‌యూసీసీ) మెంబర్‌గా నియామకం అయ్యాడు. ఈ మేరకు బుధ వారం రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజేష్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జీన్స్ మాట్లాడుతూ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

తన నియామకానికి కృషి చేసిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, పిల్లి మల్లికార్జున్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



మధు (ఫైల్)

ఇల్లందకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన వంగ మధు(28) అనే కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధు చిన్న వయస్సులోనే తల్లి చనిపోగా, తండ్రి ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. మధు గ్రామంలో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంటను సాగుచేశాడు. ఈ క్రమంలో మొక్కజొన్న లాభసాటిగా దిగుబడి రాకపోగా, సుమారు రూ. 1.50లక్షల వరకు నష్టం వచ్చింది. దీంతో మనస్థాపం చెందిన మధు ఆదివారం ఇల్లందకుంట శివారులోని ఎర్ర గుట్టల సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు.

బావిలో పడి రైతు మృతి



దేవయ్య (ఫైల్)

గంభీరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతిచెందాడు. చివరి దశలో ఎండుతున్న పంటను కాపాడుకోవటానికి ఓ రైతు తన బావిలో పూడికతీత పనులు మొదలు పెట్టాడు. పనులను చూసేందుకు తాడు సహాయంతో బావిలోకి దిగుతుండగా రైతు ప్రమాదవశాత్తు జారిపడటంతో మృతిచెందాడు.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శివంది దేవయ్య (45) తనకున్న 3 ఎకరాల పొలంలో వరి పంట వేశాడు. తన వ్యవసాయ బావిలో నీరు ఇంకిపోతుండటంతో మూడు రోజుల క్రితం క్రేన్‌తో పూడికతీత పనులు మొదలు పెట్టాడు. తాడు సహాయంతో రైతు దేవయ్య బుధవారం బావిలోకి దిగుతున్న క్రమంలో జారిపడ్డాడు. తీవ్రగాయాల పాలైన దేవయ్యను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే రైతు దేవయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



సరోజన(ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చందుర్తి మండలకేంద్రానికి చెందిన చింతపల్లి సరోజన(78)అనే వృద్ధురాలు బుధవారం మృతిచెందింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. సరోజన గత మార్చి 31న తన కుమారుడైన వెంకటేశ్వర్‌రావుతో ద్విచక్రవాహనంపై చందుర్తి నుంచి వేములవాడకు వెళ్తుండగా మండలకేంద్రం శివారులో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సరోజన తలకు బలమైన దెబ్బ తగలడంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై మృతురాలి బంధువు కారంగుల మధుసూదన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. మృతిరాలికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామ సమీపంలో కారు ఢీకొని అదే గ్రామానికి చెందిన లెక్కల లింగన్న (65) అనే వృద్ధుడు బుధవారం మృతిచెందాడు. లింగన్న నేరెళ్ల వద్ద బీటు వద్ద పనులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా జగిత్యాల వైపు నుంచి ధర్మపురి వెళ్తున్న కారు టీఎస్ 10ఈఈ 8668 డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడిపినవ్యక్తి హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన రాపర్తి వెంకటేష్‌గా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ



ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న పగిడిమర్రి సోలోమన్

భగత్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీజోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌గా పగిడిమర్రి సోలోమన్ బుధవారం బస్టాండ్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు బీవీ రావు, భూపతిరెడ్డి, డిప్యూటీ పర్సనల్‌మేనేజర్ విలాస్‌రెడ్డి, జోనల్ పర్సనల్ మేనేజర్ విలాస్ రెడ్డి, సుగుణాకర్, సీనియర్ మెడికల్‌ఆఫీసర్ గిరిసింహారావు శుభకాంక్షలు తెలిపారు.

● కరీంనగర్ జోన్ ఈడీగా పనిచేసి హైదరాబాద్ బదిలీపై వెళ్తున్న ఖుస్రోషాఖాన్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈడీ సోలోమన్‌కు టీజీఎస్‌ఆర్టీసీ ఎస్సీఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు.

పొద్దు తిరుగుడు కొనేదెన్నడు?



ముస్తానిపేట గ్రామంలో కల్లాల వద్ద ఆరబోసిన పొద్దుతిరుగుడు గింజలు

● కొనుగోలు కేంద్రాలు లేక రైతుల ఇబ్బందులు

● దళారీల బారినపడి నష్టపోతున్న వైనం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో పొద్దుతిరుగుడు రైతులు దళారీల బారినపడి తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని ముస్కానిపేట, కేసన్నపల్లె, గాలిపెల్లి, తాళ్లపెల్లి, పత్తికుంటపల్లె తదితర గ్రామాల్లో దాదాపు 1200 ఎకరాలలో రైతులు పొద్దుతిరుగుడు పంటను ఈ సంవత్సరం సాగుచేశారు. విత్తనాల ధరకు తోడు కూలీల ధరలు పెరగడంతో గతంలో కంటే పొద్దుతిరుగుడు సాగుచేయడానికి పెద్దమొత్తంలో రైతులు వెచ్చించారు. పంటచేతికి అందివచ్చే దశలో బావులు, బోర్లలో నీరు తగ్గడంతో నానా ఇబ్బందులు పడి పంటను కాపాడుకున్నారు. పొద్దుతిరుగుడు పంటను కోసి నెల రోజులు కావస్తోంది. పొదుతిరుగుడు పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రం లేదు. సిద్దిపేట, బెజ్జంకిలో మాత్రమే ఉండడంతో అక్కడికి అమ్ముదామనుకుంటే ఈప్రాంత రైతుల పంటను కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాలుకు రూ.7280 చెల్లిస్తుండగా దళారులు రూ.5500కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన కొంతమంది దళారులు ఇక్కడ రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కష్టపడి పండించిన పంటను కొంతమంది రైతులు తక్కువ ధరకు అమ్మలేక, వ్యవసాయ బావుల వద్ద కల్లాల్లోనే ఉంచుకుంటున్నారు. వర్షాలు పడితే ఎక్కడ పంట తడుస్తుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది..

బట్టు సుధాకర్, రైతు గాలిపెల్లి




పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. భూగర్భజలాలు తగ్గడంతో కొంతమేర ఎండిపోయింది. సిద్దిపేట, బెజ్జంకి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని పోయినా పట్టాదారు పాసుపుస్తకాలు చూసి తమ ప్రాంతానివి కావని తిప్పి పంపుతున్నారు. ఆరు ఎకరాలలో పంటను సాగుచేశాను. పంటను కోసి నెల రోజులు అవుతోంది. ప్రభుత్వం వెం టనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

త్వరలో సమస్య పరిష్కారం..

సురేష్‌రెడ్డి, ఇల్లంతకుంట వ్యవసాయాధికారి



పొద్దుతిరుగుడు రైతుల సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకపోయాం. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాకపోతే టోకెన్లు జారీచేస్తాం. రైతులు తొందరపడి దళారులకు అమ్మి నష్టపోవద్దు. పంటను కల్లాల వద్ద జాగ్రత్తగా కాపాడాలి.



మోటార్ సైకిల్‌ను ఢీకొన్న రెండు కార్లు

● ఇద్దరికి తీవ్రగాయాలు





రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విఠల్, అవినాష్

మానకొండూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామశివారులో మోటార్‌సైకిల్‌ను రెండుకార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన విఠల్ (18), అవినాష్ (18) అనే ఇంటర్ విద్యార్థులు మోటార్ సైకిల్‌లో పెట్రోల్ పోసుకునేందుకు బంక్‌కు వచ్చి తిరిగివెల్లుతున్నారు. జమ్మికుంట నుంచి కరీంనగర్ వైపు వెల్లుతున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొంది. అదే సమయంలో కరీంనగర్ నుంచి హుచ్చునూర్ వైపు వెల్లుతున్న మరో కారు అదే మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పందుల చోరీ

సుల్తానాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని రైస్ మిల్లులప్రాంతంలో కొందరు గుర్తు తెలియని దొంగలు మందలో ఉన్న పందులను ఎత్తుకెళ్లారు. మానుపాటి ఈదయ్యకు చెందిన 32 పందులను ఒక చోట మందగా ఏర్పాటుచేసి అందులో ఉంచగా బుధవారం ఉదయంలేచి చూసేసరికి మందలో పందులు మాయంఅయ్యాయి. దాంతో బాధితులు వెంటనేపోలీసులను ఆశ్రయించారు. సమీపంలోని రైస్‌మిల్లు అసోషి యేషన్ కార్యాలయంలోఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు ఒకబైక్‌పై ముందు వెళ్తుండగా మరోట్రాలీలో పందులను తీసుకువెళ్తున్నట్లు కనిపించింది. దాదాపు 2లక్షల రూపాయల విలువ ఉంటాయని బాధితులు తెలిపారు.

అనుమతి లేకుండా రోడ్డుపై వార్షికోత్సవం

● పాఠశాలపై కేసు నమోదు

ముస్తాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీవాణి ప్రైవేట్ పాఠశాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గణేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డుపై నిర్వహించడంతో వాహనదారులకు ఇబ్బందులు కలిగించారని పాఠశాల యాజమాన్యంతోపాటు, ఆర్గనైజర్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెలిచాల గ్రామాన్ని సందర్శించిన కేంద్ర బృందం



వెలిచాల గ్రామ పంచాయతీ ఆవరణలో కేంద్ర బృందం

రామడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల గ్రామాన్ని కేంద్ర తాగునీరు, పారిశుధ్య ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. స్వచ్ఛభారత్ మిషన్ ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామంగా ప్రకటించుకొని గ్రామంలోని పారిశుధ్య వసతులను, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, మురికినీటి నిర్వహణ, డ్రైనేజీ గుంత వాడకం, తదితర అంశాల సుస్థిరతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందంలో డిప్యూటీ సెక్రెటరీ శ్రీనివాస్, కన్సల్టెంట్ జైపాల్ దక్ష, స్వచ్ఛ భారత్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ సురేష్ బాబు ఉన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాశ్ కిరణ్, ఎంపీడీవో రాజేశ్వరి, పంచాయతీ అధికారి శ్రవణ్, గ్రామప్రత్యేక అధికారి, ఏపీవో రాధ, ఏపీఎం ప్రభాకర్, జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్లు రమేష్, వేణు, యూనిసెఫ్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కిషన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు



గాయపడ్డ తిరుపతి

ధర్మారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామయ్యపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గ్రామానికి చెందిన పల్లె తిరుపతి వృత్తిరీత్యా బుధవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. తిరుపతి పరిస్థితి విషమించడంతో అతన్ని స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

అజాగ్రత్తగా బైక్ నడిపిన బాలుడిపై కేసు

చందుర్తి, ఏప్రిల్ 2, (ఆంధ్ర జ్యోతి): అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడిపి ఆటోను ఢీకొట్టిన సంఘటనలో బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన మల్యాల జాషువా(17) అనేబాలుడు ద్విచక్ర వాహనంపై బండపల్లి నుంచి వేములవాడ వైపు వెళుతుండగా, వేములవాడ నుంచి బావుసాయిపేట వైపు వస్తున్న ఆటోను ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి జంగం జాన్‌కు గాయాలయ్యాయి. జంగం ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాషువాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై కేసు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడం, దహనం చేయడంపై యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫాహద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా ఇన్‌చార్జి అబ్దుల్ అమీర్ డీసీసీ కార్యాలయంలో సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఈ క్రమంలో జిల్లా నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. గుర్తుతెలియని వ్యక్తులు యువజన కాంగ్రెస్ నాయకుడు ఫాహద్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించి వేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి అజీం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తగలబెట్టారు. కొందరు కాంగ్రెస్ నాయకులే తమ ఫ్లెక్సీలను ధ్వంసం చేసినట్లు అనుమానంగా ఉందని ఫాహద్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

మెట్‌పల్లి పట్టణంలో చోరీ

● 13 తులాల బంగారం, 20 తులాల వెండి అపహరణ

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిపట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో బుధవారం దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి 13 తులాల బంగారం, 20తులాల వెండి ఎత్తుకెళ్లారు. మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సాయిరాంనగర్ కాలనీకి చెందిన ఎల్దాస్ శ్యామల అనే ఉద్యోగి తన బంధువుల దగ్గరికివెళ్లి తిరిగి బుధవారం సాయంత్రం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 13 తులాల బంగారం, 20తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ అనిల్ కుమార్‌లు పరిశీలించి క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఖననం చేసిన చిన్నారి మృతదేహం వెలికితీత

● మేజిస్ట్రేట్ సమక్షంలో పోస్టుమార్టం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పసికందు మృతికి రెండు ప్రైవేటు హాస్పిటల్స్ కారణమని తల్లిదండ్రుల ఫిర్యాదు చేయడంతో ఖననం చేసిన మృతదేహాన్ని పోలీసులు బుధవారం వెలికితీశారు. వివరాల్లోకి వెళితే.. ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన గండి గీతాంజలికి గతనెల 18వ తేదీన కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మగబిడ్డ జన్మించాడు. పుట్టిన తర్వాత శిశువు ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో కరీంనగర్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికి పరిస్థితిలో మార్పు రాకపోవడంతో హైదరాబాద్‌కు తరలించారు. తరలించిన గంటల వ్యవధిలో పసికందు మృతిచెందాడు. మృతదేహాన్ని ఫాజుల్‌నగర్ గ్రామంలో పూడ్చారు. అయితే తమ కొడుకు మృతికి కరీంనగర్‌లోని రెండు ప్రైవేటు ఆసుపత్రులే కారణమని రాజశేఖర్-గీతాంజలి దంపతులు కరీంనగర్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్సైలు దీపక్, చంద్రశేఖర్‌లు చిన్నారిని పూడ్చిపెట్టిన ఫాజుల్‌నగర్ గ్రామానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఖననం చేసిన చిన్నారి మృతదేహాన్ని మండల మెజిస్ట్రేట్ అబుబాకర్ సమక్షంలో వెలికితీసి ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రణతిరెడ్డి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కారు ఢీకొని ముగ్గురు విద్యార్థులకు గాయాలు

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో బుధవానం కారు ఢీకొని కుర్మదాస్, వినయ్, ప్రేమ్‌దాస్ అనే ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. గునిశెట్టి సంతోష్ అనే వ్యక్తి జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం కారు నేర్చుకుంటున్నాడు. అదే సమయంలో జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పురుషుల డిగ్రీకళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వాకింగ్ చేస్తున్నారు. సంతోష్ నడుపుతున్న కారు అదుపు తప్పి ముగ్గురు విద్యార్థులను ఢీకొట్టడంతో ఆసిఫాబాద్‌కు చెందిన కుర్మదాస్ అనే విద్యార్థికి రెండు కాళ్లు ఫ్రాక్చర్ అయ్యాయి. మరో ఇద్దరు విద్యార్థులకు స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను వెంటనే చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. వైస్‌ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

కిష్టంపల్లిలో ప్రభుత్వభూమి కబ్జాకు యత్నం

● కాపాడేందుకు విగ్రహాల ప్రతిష్ఠ



కిష్టంపల్లిలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

రామడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలోని వెంకట్రావుపల్లె పరిధిలోని కిష్టంపల్లిలో ఓవ్యక్తి ప్రభుత్వభూమి కబ్జా చేసేందుకు యత్నించగా గ్రామస్థులందరు కలిసి దేవతా మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. గ్రామస్తులకథనం ప్రకారం.. గ్రామం లోని 674సర్వే నంబర్‌లో తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిఉంది. ఈభూమిని లక్ష్మీ పూర్ పంపుహౌజ్ నిర్మాణం జరిగిన సమ యంలో మెగా కంపెనీ ఈ భూమిలో మట్టిని పోసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందింది. అయితే ఈ భూమి తనకు సంబంధించినదని ఓవ్యక్తి చదును చేస్తున్న సమయంలో గ్రామస్థులు ఆయనను అడ్డుకున్నారు. ఈ ఘటనలో స్థానిక సదరువ్యక్తి ఫిర్యాదు చేయడంతో 42మంది పై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటన ఇలా ఉండగా నాలుగురోజుల క్రితం మళ్లీ భూమిని కైవసం చేసుకోవడానికి ప్రయత్నించడంతో గ్రామస్థులంతా కలిసి అదే స్థలంలో శివలింగం నంది విగ్రహాలను నెలకొల్పారు. దీంతోగ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో సమస్య పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది.

దీంతో రూరల్ ఏసీపీ కరుణాకర్ గ్రామానికి వచ్చి పరిశీలించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. కాగా భూమి సదరు వ్యక్తికి సంబంధించిందాలేదా ప్రభుత్వానిదా అనేది తేలాల్సి ఉంది.

హత్య కేసులో నిందితుల రిమాండ్

● పది నెలల తర్వాత గుర్తింపు



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదినెలల క్రితం బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు వద్ద జరిగిన అంకం లక్ష్మీనారాయణ(55) అనే వ్యక్తి హత్యకేసులో నిందితులను బుధవారం గుర్తించి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను జగిత్యాలలో బుధవారం డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం జూన్ 14న బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు వద్ద ఒక గుర్తు తెలియనివ్యక్తిని పెట్రోల్‌పోసి కాల్చి చంపారని అప్పటి కార్యదర్శి పుల్రై చిన్న నర్సయ్య బీర్‌పూర్ పోలీస్ సేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతుడి భార్య అంకం అరుణ, చిన్నకుమారుడు అంకం సాయికుమార్‌లకు లక్ష్మీనారాయణ మృతదేహం చూపించారు. వారు ఆ మృతదేహం తమ వారిది కాదని వదిలేసి వెళ్లారు. ఆ తరువాత మృతుడి యొక్క ఎముక భాగాలను డీఎన్ఏ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. చనిపోయిన వ్యక్తి నర్సింహుల పల్లికి చెందిన అంకం లక్ష్మీనారాయణగా గుర్తించి విషయాన్ని భార్య, కుమారుడికి తెలియజేయగా వారిలో ఎలాంటి స్పందన కనిపించలేదు. దీంతో మృతుడిభార్య అరుణ, కుమారుడు సాయికుమార్ మీద అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించగా మొదట్లో నేరాన్ని అంగీకరించలేదు. దీంతో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం పాలిగ్రాఫ్(లైడిటెక్టర్) టెస్ట్‌కు మృతుడి కుమారుడు, భార్యను పంపించామని డీఎస్పీతెలిపారు. దాంట్లో అంకం లక్ష్మీనారాయణను హత్యచేసింది వారేనని నిర్ధారించుకొని నిందితులను అదుపులోనికి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేసిన జగిత్యాల రూరల్ సీఐకృష్ణారెడ్డిని డీఎస్పీ అభినందించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కేసులో కోర్టుకు మంత్రి శ్రీధర్‌బాబు



నాంపల్లి కోర్టు విచారణకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంప్రాజెక్టులో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేసినందుకు అప్పటి బీఆర్ఎస్‌ప్రభుత్వం నమోదు చేసిన కేసులో మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. 2017లో బసంత్‌నగర్ పోలీసులు మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు హర్కాల వేణుగోపాల్, అన్నయ్యగౌడ్, శశిభూషణ్‌కాచేతోపాటు మరో 9 మందిపై కేసులు నమోదుచేశారు. విచారణలో భాగంగా వారు కోర్టుకు హాజరయ్యారు. శాంతియుతంగా ఆందోళన చేసినా అప్పటి ప్రభుత్వం తమపై ఐపీసీ 147, 353, 427 రెడ్‌విత్149 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వారు వాపోయారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో యూనివర్సిటీల భూములు కబ్జా



ఎస్‌యూలో బంద్ పాటించి నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యూనివర్సిటీల భూములు కబ్జాకు గురవుతున్నాయని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు ప్రజలు ప్రశాంతంగా జీవించలేకపోతున్నార న్నారు. విద్యార్థులకు ఉపయోగపడే బయోడైవర్సిటీ యూనివర్సిటీ 100 ఎకరాలను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకు న్నపుడు విద్యార్థులు నిరసన వ్యక్తం చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం 400 ఎకరాల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమిని వెంచర్లు చేసి సొమ్ము చేసుకోవాలని చూస్తోందన్నారు. ఇక్కడ ఎన్నో రకాల పక్షులు, జంతువులు జీవిస్తున్నాయని, వాటి ప్రాణాలు తీసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూలో భూముల కోసం విద్యార్థులు ధర్నా చేస్తుంటే లాఠీచార్జి సిగ్గుమాలిన చర్యన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మాల ని చూస్తున్న భూములను వెంటనే యూనివర్సిటీ కేటాయించాలని, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసులను ఎత్తి వేయాలని, లేని పక్షంలో సెక్రెటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యులు కిరణ్మయి, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, యూనివర్సిటీ అధ్యక్షులు బాలకృష్ణ, కార్యకర్తలు సాయి, అనూష, గౌరీ, ప్రియ, మానస తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో కేంద్ర బృందం పర్యటన



కేంద్ర బృందాన్ని ఆహ్వానిస్తున్న అధికారులు

కోనరావుపేట ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో జలశక్తి స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర బృందం అధికారులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతలు, కంపోస్ట్ షెడ్‌లను మర్తనపేట ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్యం, తాగునీటి వంటి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం డిప్యూటీ సెక్రెటరీ శ్రీనివాస్ సెక్షన్ ఆఫీసర్ నితిన్‌తో పాటు సెంట్రల్ టీం వర్మ జైపాల్ సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

పెన్షనర్లకు నష్టం చేసే బిల్లును ఉపసంహరించాలి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు నష్టం చేసే బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని టీ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన చర్చా వేదికలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లను పదవీ విరమణ తేదీ ఆధారంగా విడదీయడం అసమంజ సమని ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పును గుర్తు చేశారు. ఈ సవరణ బిల్లు సుప్రీం తీర్పును నిర్వీర్యం చేసేలా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ పీసీ హన్మంత్, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్‌రావు, ఎండీ యాకుబ్, పూసల అశోక్‌రావు, డిండిగాల విఠల్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతీ రిబ్బన్‌కు ఓ ప్రత్యేకత

మీకు తెలుసా..

ఒక్కో సందర్భానికి ఒక్కో రంగు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏవైనా నిరసనలు జరుగుతున్నప్పుడు అందులో పాల్గొన్న వారు నల్ల రంగు రిబ్బన్లు ధరిస్తారు. మహిళల ఆరోగ్యం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తే గులాబీ రంగు రిబ్బన్లు ధరిస్తారు.. సందేహాలకు, సంతాపాలకు, నిరసనలకు, అవగాహనకు ఒక్కో సందర్భానికి ఒక్కో రిబ్బన్ వాడుతుంటారు. కొన్ని రకాల వ్యాధులు, వాటి పేరుకంటే కూడా రిబ్బన్ సింబల్ నే పాపులర్ అయ్యాయి. ఆ సింబల్ చూడగానే వ్యాధిపై అవగాహనకు వచ్చేస్తాం. రిబ్బన్లతో రకరకాల రంగులు నలుపు, తెలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు ఇలా ఒక్కో రంగు ఒక్కో అంశాన్ని తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ఏ రంగు రిబ్బను ఏం అంశాన్ని సూచిస్తుందో తెలుసుకుందాం.

18 రకాల రిబ్బన్లు

మానవ శరీరంలో వివిధ అవయవాలకు సోకిన క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు వైద్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు 18 రకాల రిబ్బన్లను ఉపయోగిస్తారు. క్యాన్సర్ వ్యాధి సోకడానికి కారణాలు, వాటి లక్షణాలు, ట్రీట్మెంట్ విధానం ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు వీటిని ధరిస్తారు.



నల్ల రంగు..

తమ డిమాండ్లను తెలియజేస్తూ నిరసన వ్యక్తం చేసినప్పుడు నలుపు రంగు రిబ్బన్ ధరిస్తారు. మృతిచెందిన వారికి సంతాప సూచకంగా నివాళి అర్పించే సమయంలోనూ వీటిని ధరిస్తారు.

ఎరుపు రంగు

ఎయిడ్స్, బ్లడ్ క్యాన్సర్, గుండె జబ్బులు, వ్యసనాలు, విపత్తుల సందర్భంగా నిర్వహించే సమావేశాల్లో ఎరుపు రంగు రిబ్బన్‌ను ధరిస్తారు. అత్యవసర పరిస్థితులకూ దీనిని ఉపయోగిస్తారు.

నీలం రంగు

నీలం రంగు రిబ్బన్‌ను 100కు పైగా సందర్భాల్లో ఉపయోగిస్తారు. ప్రధానంగా మానవ అక్రమరవాణా, బెదిరింపులకు వ్యతిరేకంగా వీటిని ఉపయోగిస్తారు. జల సంరక్షణపై అవగాహన కల్పించే సమయంలోనూ నీలం రంగు రిబ్బన్‌ను వాడతారు.

తెల్ల రంగు

గర్భిణులు,మహిళలపై దాడులు జరిగినప్పుడు వాటికి వ్యతిరేకంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో తెల్ల రంగు రిబ్బన్ ధరిస్తారు. సురక్షిత మాతృత్వం, శాంతి, అహింసలను తెలుపుతూ జరిగే కార్యక్రమాల్లో వీటిని ఉపయోగిస్తారు.

ఆకుపచ్చ రంగు

మూత్రపిండాలు, కాలేయం, అవయవ దానం, సురక్షిత డ్రైవింగ్ పై అవగాహన కల్పించేందుకు ఆకు పచ్చ రంగు రిబ్బన్‌ను ఉపయోగిస్తారు. గ్లోబల్ వార్మింగ్‌పై సమావేశాల్లో ఈ రంగు రిబ్బన్‌ను వాడతారు.

పసుపు రంగు

యుద్ధ ఖైదీలు, తప్పిపోయిన వారి కోసం ఏర్పాటు చేసిన సమా వేశాల్లో పసుపురంగు రిబ్బన్ ను ధరిస్తారు. ఆత్మహత్యల నివారణకు, ఎముకల క్యాన్సర్ తదితర వాటి గురించి నిర్వహించే అవగాహన సదస్సుల్లో వీటిని ఉపయోగిస్తారు.

గులాబీ రంగు

గులాబీ రంగు రిబ్బన్ మహిళల ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను సూచిస్తుంది. ముఖ్యంగా ఆడవారిలో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు దీనిని అంతర్జాతీయ గుర్తుగా ఉపయోగిస్తారు.

కొండగట్టులో హనుమాన్ చిన్న జయంతి ఏర్పాట్లు

మల్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగే హనుమాన్ చిన్న జయంతి కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. భక్తుల మాల విరమణ కోసం కల్యాణకట్ట వద్ద బారికేడ్లు, వాటి పై నుంచి భక్తులు కంపార్టుమెంట్లలోకి దూకకుండా పోలీసుల సూచనలతో ఈసారి కొత్తగా జాలీలు ఏర్పాటు చేస్తున్నారు. చలువ పందిళ్ల ఏర్పాటు పనులు కొనసాగుతుండగా దిగువ కొండగట్టు, దొంగలమర్రి



మాల విరమణ ప్రదేశంలో బారికేడ్లు కడుతున్న సిబ్బంది

వద్ద దేవస్థానం తరఫున స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. బారికేడ్లు, ఇతర ఏర్పాట్లను ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, మల్యాల సీఐ నీలం రవి, అధికారులతో కలిసి పరిశీలించారు. కేవలం దర్శనాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పోలీస్ అవుట్‌పోస్టు నుంచి కోనేరు వరకు ఈసారి ప్రత్యేక దారి ఏర్పాటు చేయనున్నారు.

రేపు ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

హనుమాన్ చిన్న జయంతి ఏర్పాట్లపై శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించి తగు సూచనలు చేయనున్నారు.

త్వరలో రిజర్వాయర్లలో పూడికతీత పనులు



కొత్తపల్లిలో మోయతుమ్మెద వాగు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ పెద్ది రమేష్, అధికారులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయం ప్రకారం త్వరలో దిగువ మానేరు జలాశయం, మిడ్ మానేరు జలాశయం, కడెం ప్రాజెక్టులకు సంబంధించి పూడికతీత పనులను ప్రారంభించనున్నట్లు ఇరిగేషన్‌శాఖ, సర్కిల్-2, ఎస్ఈ పెద్ది రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల మోయతుమ్మెద వాగును, కొత్తపల్లి శివారులోని ఎస్ఆర్ఎస్పీ భూములను రెవెన్యూ, ఇతర ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులతో కలిసి ఎస్ఈ రమేష్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఎండీ, ఎంఎంఆర్, కడెం రిజర్వాయర్‌లలో పూడికతీతకు సంబంధించి అగ్రిమెంట్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సుమారు 1453కోట్ల వ్యయంతో 20సంవత్సరాలకు సంబంధించి బాంబెకు చెందిన ఈథర్ ట్రినిటీ సహారా కన్సార్టియం కంపెనీ టెండర్లలో ఈ పనులను దక్కించుకుందని తెలిపారు. నెల వరకు పూడికతీత పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. పనులు ప్రారంభించే ముందు రిజర్వాయర్ నుంచి తీసిన ఇసుకను ఎక్కడ డంప్‌చేయాలి, కంపెనీ నిర్వాహకులకు సంబంధించి కార్యాలయం ఏర్పాటు, వేబ్రిడ్జ్ ఏర్పాటు, పనులు చేసే సిబ్బంది, లేబర్ ఉండేందుకు, మిషనరీల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. ఎస్సారెస్పీ స్థలాన్ని కూడా గుర్తించామని తెలిపారు. రిజర్వాయర్‌లలో పూడికతీత వల్ల నీటి నిల్వ 3.9 టీఎంసీ సామర్థ్యం పెరుగుతుందన్నారు. అదే విధంగా పూడికతీత వల్ల వచ్చే ఇసుకను సంబంధిత కాంట్రాక్టర్ ప్రభుత్వానికి టన్నుకు 406.64 రూపాయలు చెల్లించి ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం ఉంటుందని అన్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం చేకురుతుందన్నారు. గతంలో రిజర్వాయర్‌ల కోసం డబ్బులు చెల్లించి పనులు చేయించేవారు కానీ ప్రస్తుతం రెండు ప్రయోజనాలు వస్తుండటంతో ప్రభుత్వం ముందు ఈ మూడు రిజర్వాయర్‌లలో పూడికతీతపై పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుందన్నారు. ఇది విజయవంతమైతే మిగతా ప్రాజెక్టులలో కూడా ఇలాంటి ప్రయోగం చేసే అవకాశాలు లేకపోలేదని ఎస్ఈ పెద్ది రమేష్ తెలిపారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఇరిగేషన్‌శాఖ ఈఈ నాగభూషణ్ రావు, ఏజెన్సీ పర్సన్ సతీష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి రథోత్సవం..



రథంపై స్వామివారి ఊరేగింపు

వేములవాడ కల్చరల్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని రాములవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవమూర్తులను హంసవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రావణ్ కుమార్ తదితరులున్నారు.

రాజన్న సేవలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అధికారుల బృందం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారిని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అధికారులు బుధవారం దర్శించుకున్నారు. గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్ పరిశీలనలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చిన బృందం సభ్యులు రాజన్నను దర్శించుకొని, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అధికారుల బృందానికి ఆశీర్వచనం ఇవ్వగా, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, నరేందర్‌లు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



కోడెమొక్కు, చెల్లించుకుంటున్న అధికారుల బృందం

జాతీయ సీనియర్స్ ఖో-ఖో జట్లకు కోచ్‌లుగా ఉమ్మడి జిల్లా వాసులు



పండుగ ఆనంద్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలోని పూరీలో నిర్వహిస్తున్న 57వ సీనియర్స్ జాతీయ ఖో-ఖో పోటీలకు ఉమ్మడి జిల్లావాసులు కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పురుషుల జట్టుకు ఇల్లంతకుంటకు చెందిన రైల్వే క్రీడాకారుడు పూర్వ భారత జట్టు కెప్టెన్ పండుగ ఆనంద్, భారత పురుషుల రైల్వే జట్టుకు ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన దక్షిణ మధ్య రైల్వే క్రీడాకారుడు ఇస్లావత్ నరేష్ కోచ్‌గా వ్యవహరిస్తున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్, నరేష్‌ను రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జంగా రాఘవరెడ్డి, నాతి కృష్ణమూర్తి, జిల్లా ఖో-ఖో సంఘం ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, సంఘం బాధ్యులు అభినందించారు.



ఇస్లావత్ నరేష్

ఎన్టీపీసీ నిర్మాణాలపై కార్పొరేషన్ కొరడా



- నోటీసులకు స్పందించని ఎన్టీపీసీ యాజమాన్యం
- రూ.99 కోట్ల అపరాధ రుసుం విధించిన కార్పొరేషన్

కోల్‌సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ అక్రమ నిర్మాణాలపై రామగుండం నగరపాలక సంస్థ కొరడా ఝుళిపించింది. కార్పొరేషన్ అనుమతులు లేకుండా ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో నిర్మాణాలు జరిపి కార్పొరేషన్ నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు రూ.99,28,29,548 అపరాధ రుసుం విధించినట్టు కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో గత ఏడాది భారీ నిర్మాణాలు చేపట్టింది. మొత్తం 12రకాల నిర్మాణాలను చేపట్టారు. సీ టైపు, బీ టైపుల్లో అపార్ట్‌మెంట్ టవర్లు, సీఐఎస్ఎఫ్‌కు సంబంధించిన బిల్డింగ్‌లు, హెచ్‌ఓడీ బిల్డింగ్, డీ టైపు బిల్డింగ్‌లు, వీఐపీ గెస్ట్ హౌస్, బ్యాచ్‌లర్ హాస్టల్, ఏసీ రెస్టారెంట్, కమ్యూనిటీ సెంటర్ తదితర భవనాలను నిర్మించింది.

ఈ భవనాలకు కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. దీంతో ఏప్రిల్ 22, 2024న 'ఆంధ్రజ్యోతి'లో 'రామగుండంలో అనుమతి లేకుండానే భారీ కట్టడాలు' శీర్షికన కథనం ప్రచురిత మైంది. భవన నిర్మాణాలు పూర్తవుతున్నా అనుమతు లు తీసుకోకపోవడంతో రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్, జిల్లా యంత్రాంగం సీరియస్‌గా స్పందించారు. ఎన్టీపీసీ యాజమాన్యం చట్ట ప్రకారం మెదలాలని, వెంటనే అనుమ తులు తీసుకోవాలని సూచించారు. దీంతో మొత్తం 12 నిర్మాణా లకు సీ టైపు భవనాలు, సీఐఎస్ఎఫ్ భవనాలు తదితర నిర్మా ణాలకు రూ.2.4కోట్లు ఫీజు చెల్లించింది. కొన్ని నిర్మాణాలకు మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు ఇచ్చింది. మిగతా నిర్మాణాలు రెసిడెన్షియల్ జోన్‌లో లేకపోవడంతో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) తీసుకోవాలంటూ నోటీసులు ఇ చ్చింది. దీంతో ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మాణ స్థలాలకు సం బంధించి సీఎల్‌యూకు ఫైల్ పెట్టింది. డీ టైపునకు సంబంధించి 8.33ఎకరాలు, హెచ్‌ఓడీ భవనాలకు సంబంధించి 7.98 ఎకరాలు, వీఐపీ గెస్ట్‌హౌస్ 2.07ఎకరాలు, బీ టైపు క్వార్టర్లు 3.21 ఎకరాలకు సీఎల్‌యూకు దరఖాస్తు చేసింది. గత ఏడాది సీఎల్‌యూకు దరఖాస్తు చేయగా డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కార్యాలయం షార్ట్ ఫాల్ ఇచ్చింది. ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు, టోన్సు మ్యాప్‌లు సమర్పించాలని పేర్కొన్నది. మార్చి 19న రామగుండం నగర కమిషనర్ ఆరు నిర్మాణాలకు సంబంధించి అనుమతి లేని భవనాలకు నోటీసులు జారీ చేశారు. దీనిపై స్పందించక పోవడంతో పది రోజుల కాల వ్యవధిపై మార్చి 29న పెనాల్టీ నోటీసులు జారీ చేసినట్టు కమిషనర్ తెలిపారు.

ఆరు భవనాలకు పెనాల్టీ

రామగుండం నగరపాలక సంస్థ ఎన్‌టీపీసీకి చెందిన అనుమతి లేని ఆరు నిర్మాణంలో ఉన్న భవనాలకు రూ.99.28 కోట్ల పెనాల్టీ నోటీసులు జారీ చేసింది. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం అనుమతి లేని కట్టడాలకు నోటీసులకు కూడా స్పందించకపోతే భవనాలకు సంబంధించి స్థలం, భవనాల విలువను పరిగణలోకి తీసుకుని అపరాధ రుసుము విధిస్తారు. బీ టైపు భవనాలకు రూ.39.61లక్షలు, హెచ్ఓడీ బిల్డింగ్‌కు రూ.18.55కోట్లు, టైపు డీ భవనాలకు రూ.27.29కోట్లు, గెస్ట్ హౌస్ బిల్డింగ్‌కు రూ.6.61కోట్లు, ఏసీ రెస్టారెంట్ బిల్డింగ్‌కు రూ.2.35కోట్లు, కమ్యూనిటీ సెంటర్ బిల్డింగ్‌కు రూ.4.83కోట్లు పెనాల్టీ జారీ చేసింది.





ఎన్టీపీసీలో నిర్మిస్తున్న భవనాలు

రేవంత్‌రెడ్డికి రైతన్న, నేతన్న రెండు కళ్లు..

అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక రైతన్న, నేతన్నను రెండు కండ్లుగా చూసుకుంటున్నారని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం వస్త్ర వ్యాపార సంఘం భవనంలో విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు రూ.25వేల కోట్లతో రైతన్నకు రుణమాఫీ, రైతు బంధును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నేతన్నల రుణమాఫీ రూ.33 కోట్లతో ఐదు వేల మందికి లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని ముఖ్యమంత్రిని కోరగా, వెంటనే రుణమాఫీ చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా రూ.380 కోట్లు బతుకమ్మ చీరల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ద్వారా బకాయిలను విడుదల చేశారన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమకు విద్యుత్ సంక్షోభాన్ని తీసుకొచ్చి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. సెస్‌లో గత ప్రభుత్వానికి చెందిన పాలకవర్గం ఉండడం వల్ల ఒత్తిడి తెస్తున్నారన్నారు. బతకమ్మ చీరల స్థానంలో ప్రభుత్వం రూ.680కోట్ల ఆర్డర్లతో కోటి 30 లక్షల చీరలను ఎనిమిది కోట్ల మీటర్ల ఆర్డర్లను తీసుకొచ్చిందన్నారు.

ఈ ఆర్డర్లు సకాలంలో జరగాలంటే విద్యుత్ సదుపాయం ఉండాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల పనులు జరగకుండా సెస్ పాలకవర్గం ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. విద్యుత్ బకాయిల పేరుతో మీటర్ వైర్లను కట్ చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సెస్ పాలకవర్గం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికే తాము వచ్చామన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, మురళి, వస్త్ర వ్యాపార సంఘం తాటి పాముల దామోదర్, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి గౌడరాజు, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కార్యదర్శ ఆంకారపు రవి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి

ఎల్ఎఆర్ఎస్‌కు మరో అవకాశం

(5వ పేజీ తరువాయి)

చేయడంతో జిల్లాలో ఆమోదించిన దరఖాస్తుల్లో 26 శాతం మంది దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించారు. 2020, ఆగస్టు 26లోపు సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన లే అవుట్ యజమా నులు, ప్లాటు ఓనర్లకు ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించినట్లు ప్రకటించింది. 25 శాతం రాయితీ కల్పించి విస్తృత ప్రచారం చేపట్టింది. ప్రస్తుతం మరో నెల రోజుల పాటు గడువు పెంచడంతో జిల్లా అధికార యంత్రాంగం ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పెంపు, దాని ప్రయోజనాల గురించి మరింత అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని నిర్ణయించింది.

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

కోల్‌సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు గడువును ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించింది. ఈ మేరకు బుధవారం జీఓ ఆర్‌టీ నెం.182 జారీ అయింది. రామగుండం నగర పాలకసంస్థలో ఇప్పటి వరకు 900 దరఖాస్తులు పరిష్కారమయ్యాయి.

మంథని : ఎల్ఆర్ఎస్ ట్యాక్స్ చెల్లింపు గడువును ప్రభుత్వం ఈనెల 30 వరకు పొడిగించినట్లు మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 సంవత్సరంలో ఎల్ఆర్ ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యాజమానులు ఈ నెల 30 లోగా ఫీజు చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని సూచించారు.

రేపు బేగంపేట్ వారసంత వేలం

రామగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలోని వారసంత వేలం పాటను ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి రత్నాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికిగ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించే వేలం పాటకు ఆసక్తి గలవారు పాల్గొనాలని తెలి పారు.

75 శాతం ఇంటి పన్నుల వసూలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో గత ఆర్థిక సంవత్సరం 75శాతం ఇంటి పన్నులు వసూలైనట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ తెలిపారు. తమ మున్సిపాలిటీ కేంద్రం నుంచి వచ్చే 2025-26కు సంబంధించి, 15వ ఆర్థిక సంఘం నిధులు రావడానికి అర్హత సాధించిందన్నారు.

డ్రగ్స్‌కి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు

పెద్దపల్లి రూరల్ , ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.లక్ష్మీనర్సయ్య అన్నారు. గురువారం పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ చైర్మెన్ మేరుగు హన్మంతుగౌడ్ ఆధ్వర్యంలో వైభవంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల కౌంటర్ ఏర్పాటు

కోల్‌సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తులు స్వీకరించడానికి రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం మెప్మా విభాగంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్‌జే అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.

అంతర్గాం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ

అంతర్గాం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం పోలీస్‌స్టేషన్‌ను బుధవారం పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలు, లాకప్‌లను పరిశీలించారు.

మందకృష్ణను కలిసిన నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి మాదిగ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ ప్రతినిధులు బుధవారం హైద్రాబాద్‌లో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణను కలిశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొప్పదండి దుర్గాప్రసాద్, అధ్యక్షుడు బొంకూరి మోహన్, సలహాదారుడు రాజేశ్వరరావు, ప్రతినిధులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మంథని/మంథనిరూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. స్థానిక సుభాష్‌నగర్‌లో తాటి శ్రీనివాస్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పుట్టపాక గ్రామంలో మాజీ సర్పంచ్ రొడ్డ మమత తండ్రి కుడిది లచ్చయ్య ఇటీవల మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించారు.

రాజాపూర్‌లో రెవెన్యూ అధికారుల విచారణ

రామగిరి: మండలంలోని రాజాపూర్‌లో ఓసిపి-2 ప్రాజెక్టు బ్లాస్టింగ్‌లతో దెబ్బతిన్న గృహాలను ఇన్‌చార్జి తహసీల్దార్ మానస, రెవెన్యూ సిబ్బంది, సింగరేణి డిప్యూటి మేనేజర్ కోల శ్రీనివాస్ పరిశీలించారు.

చెరువు భూముల కబ్జాపై దళితుల ధర్నా

మంథని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డి చెరువును ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేయటాన్ని నిరసిస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట కాకర్లపల్లి గ్రామ దళితులు బుధవారం ధర్నా నిర్వహించారు.

పేదలకు సమృద్ధిగా సన్న బియ్యం సరఫరా

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు సమృద్ధిగా సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ సుభాష్‌నగర్‌లో రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 413 చౌక ధరల దుకాణాల ద్వారా ఇక నుంచి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాటా డుతూ, దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 55 రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, డి.యం. శ్రీకాంత్ , సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరలో నూతన రేషన్‌కార్డులు

ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు

పెద్దపల్లి రూరల్ : గత ప్రభుత్వం 10 ఏళ్ల అధికారంలో ఉండి అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేసిందని , కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందిస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బుధవారం మండలంలోని నిట్టూరు గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ వేణుతో కలిసి ప్రారంభించారు.

● ఊర చెరువు గట్టుపై కల్వర్టుకు శంకుస్థాపన

నిట్టూరు గ్రామ శివారులోని రైతులకు ఇబ్బందులు లేకుండా ఊర చెరువు గట్టుపై రూ. 20 లక్షల నిధులతో నిర్మించే కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే విజయరమణరావు, అదనపు కలెక్టర్ వేణు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో రాజేందర్, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, ఏవో అలివేణి, నాయకులు పాల్గొన్నారు.

ఎలిగేడు: తెల్లరేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతి లబ్ధిదారునికి సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బుధవారం మండలంలోని ధూళికట్ట, ఎలిగేడులో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సన్నబియ్యం అందజే స్తామని రెండు ఎన్నికల్లో వాగ్దానం చేసి ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణు, ఆర్డీఓ గంగయ్య, డీఎస్ఓ రాజేందర్, తహసీల్దార్ ఎండి.బషీరోద్దీన్, ఎంపీడీఓ భాస్కర్‌రావు, మండల కాం గ్రెస్ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, కోరు కంటి వెంకటేశ్వర్‌రావు, కొండ తిరుపతి, సీహెచ్ మనోహర్‌రావు, బాలసాని పర్శరాంగౌడ్, పడాల పర్శంగౌడ్ పాల్గొన్నారు.



పెద్దపల్లిలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి: పేదప్రజలకు కడుపునిండా అన్నం పెట్టేందుకే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని కాచాపూర్,కమ్మరికుంటలో సన్న బియ్యంను జిల్లా అదనపు కలెక్టర్ వేణు, ఆర్డిఓ గంగయ్యతో కలిసి పంపిణీ చేసారు. తహశీల్దార్ జక్కని స్వర్ణ, ఎంపీఓ అనిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ గండు సంజీవ్ పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు సాగునీరు చేరేలా చర్యలు : కలెక్టర్

కమాన్‌పూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చివరి ఆయకట్టు వరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగునీరు చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కమాన్‌పూర్, పెద్దపల్లి ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. పెద్దపల్లి మండలం రంగాపూర్ 43.5కిమీవద్ద ఎస్సారెస్పీ డి-83 కాలువను, కమాన్‌పూర్ మండలం గుండారం వద్ద ఆర్ఎస్‌టీ కెనాల్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. రైతులకు అవసరమైన సాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఉండటానికి వీలులేదని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాల్వల్లో సిల్ట్ తొలగింపు, చిన్నచిన్న మరమ్మత్తులకు ప్రతిపాదనలు అందిస్తే అందిస్తే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎస్ఈ సత్యరాజ్‌చంద్ర, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి కే.శ్రీనివాస్, ఈఈ మంథని బలరామయ్య ఉన్నారు.



గ్రూప్-1 ర్యాంకర్‌ను అభినందిస్తున్న కలెక్టర్

గ్రూప్ -1ర్యాంకర్‌కు అభినందన

పెద్దపల్లి కల్చరల్: గ్రూప్-1 పరీక్షల్లో మంథని మండలం ఖాన్‌సాయిపేట గ్రామానికి చెందిన జక్కుల అరుణకుమార్ రాష్ట్రస్థాయిలో 114వ ర్యాంకు, మల్టీ జోనల్1స్థాయిలో 64వ ర్యాంకు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యార్థి, అతని తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, తల్లిదండ్రులు మల్లేశ్వరి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలంటూ బుధవారం రాత్రి ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. రాజమండ్రి ప్రాంతంలో జరిగిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, రవి పాల్, డిలైట్, గాబ్రియల్, లక్ష్మణ్, జాకబ్, ప్రకాష్, థామస్ దయానంద్‌గాంధీ, జిమ్మిబాబు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ పట్టణంలో కూడళ్ల అభివృద్ధికి చర్యలు

● ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని అన్ని ప్రధాన రోడ్లను, చౌరస్తాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. కోటిన్నర రూపాయల వ్యయంతో సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో చేపట్టనున్న మిగులు బీటీ రోడ్డు నిర్మాణం పనులు, మీడియన్ నిర్మాణం,సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టడానికి వేసిన శిలాఫలాకాన్ని ఎమ్మెల్యే బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ పెద్దపల్లి నియోజకవర్గంలో పెద్దపల్లి తర్వాత సుల్తానాబాద్ పట్టణం అత్యంత ప్రాముఖ్యత గలదని గత ప్రభుత్వంలో వివక్షత మూలంగా అబివృద్ధికి నోచుకోలేదన్నారు. సుల్తానాబాద్ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, నాయకులు పన్నాల రాములు, రాజలింగం, అబ్బయ్యగౌడ్, సతీష్, తిరుపతి, రాజయ్య పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్‌కు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జే.రంగారెడ్డి ఘన నివాళులర్పించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు ఎం.అంజయ్యగౌడ్, గౌడసంఘ ప్రతినిధులు బాలసాని వెంకటేశంగౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మంథని: సర్దార్ పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం సమీపం లోని పాపన్నగౌడ్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఆయన పోరాటాలను కొనియాడారు. బీఆర్ఎస్ నేతలు ఏగోలపు శంకర్‌గౌడ్, మాచీడి రాజుగౌడ్, శంకర్‌లాల్, గొబ్బూరి వంశీ, కనేవేన శ్రీనివాస్, ఆసీఫ్, కుమార్, అడిచర్ల సమ్మయ్య పాల్గొన్నారు.

ఓదెల: మండల కేంద్రంలో ఓదెల గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంఘం అధ్యక్షులు నాగపురి రవి ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పొత్కపల్లి ఎస్ఐ, గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళులర్పిస్తున్న రంగారెడ్డి

కమాన్‌పూర్: సర్దార్‌సర్వాయి పాపన్న 315వ వర్ధంతి నాగారం గ్రామపంచాయతీ పరిధిలోని లింగాల గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్వాయిపాపన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్వాయిపాపన్న మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు బత్తిని నాగమ జీగౌడ్, మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కుమార్‌గౌడ్, లింగాల గౌడసంఘం అధ్యక్షుడు నల్లగొండ నాగరాజు, ఉపాధ్యక్షుడు కమ్మగోని భాస్కర్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.



సమష్టి కృషితో ఓసీపీ-1 లక్ష్యాన్ని సాధించాం



మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ఉద్యోగుల సమష్టి కృషితో ప్రాజెక్టుకు కేటాయించి వార్షిక లక్ష్యాన్ని సాధించినట్టు ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. బుధవారం ప్రాజెక్టు ఆవరణలో జరిగిన అభినందన సభలో జీఎం మాట్లాడారు. ఆర్జీ-3 ఏరియాకు 62.50 లక్షల టన్నుల టార్గెట్ కేటాయించగా 65.11 లక్షల టన్నుల ఉత్పత్తి(104శాతం) జరిగినట్టు జీఎం పేర్కొన్నారు. ఓసీపీ-1 ఉద్యోగులు శ్రమించి ప్రాజెక్టుకు నిర్దేశించిన 35 లక్షల టన్నుల బొగ్గు లక్ష్యానికి 35.01 లక్షల టన్నుల ఉత్పత్తి చేసినట్టు జీఎం తెలిపారు. ప్రణాళికాబద్ధంగా అధికారులు, ఉద్యోగులు పనిచేసిన కారణంగా లక్ష్యాన్ని సాధించామని సుధాకర్‌రావు అన్నారు. వార్షిక లక్ష్యాలను సాధిస్తూ ఆదర్శవంతంగా నిలుస్తున్న ఓసీపీ-1 ఉద్యోగులు అదే స్ఫూర్తితో పనిచేయాలని జీఎం కోరారు. ఈకార్యక్రమంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, సీఎంఓఏఐ ప్రతినిధి వినాయక్, ప్రాజెక్టు ఆఫీసర్ రాజశేఖర్, పీఈ ఉదయ్‌భాస్కర్, ఇంచార్జి మేనేజర్ కోటయ్య, పిట్ సెక్రెటరీలు తిరుపతిరావు, వెంకటస్వామి పాల్గొన్నారు.

వీకేపీ గనిలో మ్యాన్‌రైడింగ్ ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వకీల్‌పల్లె గనిలో మ్యాన్‌రైడింగ్ సిస్టంను బుధవారం యాజమాన్యం పునఃప్రారంభించింది. కంటిన్యూస్ మైనర్ ఓవర్ హాలింగ్ కారణంగా కొంతకాలంగా మ్యాన్‌రైడింగ్ నిలిచిపోయింది. మ్యాన్‌రైడింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న కార్మికులకు తిరిగి అందుబాటులోకి తీసుకవచ్చారు. అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు మైసమ్మకు పూజలు చేసి మ్యాన్‌రైడింగ్‌ను ప్రారంభించారు. ప్రస్తుతానికి ఫస్ట్ సీమ్ వరకు మ్యాన్‌రైడింగ్ అందుబాటులో ఉన్నదని, పూర్తిస్థాయిలో 48వ లెవల్ వరకు నడిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ బొంత రాజు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ రవికిరణ్, సేఫ్టీ ఆఫీసర్ రాంకుమార్, అధికారులు అజయ్, మధుకర్‌రెడ్డి, పవన్, శరత్ పాల్గొన్నారు.

శ్రమ దోపిడీ అంతం చేయడానికి పోరాటం

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

కళ్యాణ్‌నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని రకాల దోపిడీ, అణిచివేత, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి శ్రామిక వర్గాన్ని విముక్తి చేసి, పెట్టుబడిదారి సమాజానికి ప్రత్యామ్నాయంగా కార్మిక వర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో సీఐటీయూ పనిచేస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. బుధవారం గోదావరిఖని శ్రామిక భవన్‌లో సీఐటీయూ జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 6న కార్మిక ఉద్యమ నేత, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదీవే వర్ధంతి నుండి ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వరకు సామాజిక న్యాయం సాధన క్యాంపెయిన్ చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 10న శ్రామిక మహిళా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన ఉద్యమ నేత విమల రణదీవే జయంతి, ఏప్రిల్ 11న భారతీయ సామాజిక సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 8, 9, 10 తేదీల్లో సామాజిక ఉద్యమ సంఘీభావ నిధిని కార్మికుల్లో, ఉద్యోగుల్లో విరివిగా సేకరించాలన్నారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, నాయకులు వేల్పుల కుమారస్వామి, ఎరవెల్లి ముత్యంరావు, మెండె శ్రీనివాస్, ఎన్, బిక్షపతి, జీ జ్యోతి, ఎం రామాచారి, డీ కొమరయ్య, సిపెల్లి రవీందర్, తాండ్ర అంజయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ద్వారా సీతారాముల కల్యాణ తలంబ్రాలు

మంథని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా ఆర్టీసీ సంస్థ ద్వారా భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను హోం డెలివరీ చేస్తున్నట్లు మంథని డీఎం శ్రావణ్‌కుమార్ బుధవారం తెలిపారు.అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలునికి తప్పిన ప్రమాదం

రామగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీలోని మంథని-పెద్దపల్లి రహదారి తెలంగాణ చౌరస్తాలో బుధవారం యశ్వంత్ అనే బాలుడికి తృటిలో ప్రాణపాయం తప్పింది. తెలంగాణ చౌరస్తా వ్యాపార సముదాయం వద్ద రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇసుక లోడ్‌తో మంథని నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న ఇసుక లారీ టైర్ కిందపడిన కంకర లేచి వేగంగా బేకరీలోకి దూసుకువచ్చింది. అక్కడే ఉన్న యశ్వంత్‌కు వెంట్రుకవాసిలో ప్రాణపాయం తప్పింది. కంకర అద్దానికి తగలడంతో అద్దం పగిలిపోయింది.

అభివృద్ధి కార్యక్రమాలపై అసత్య ఆరోపణలు

మంథని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంథని ప్రాంతంలో చేస్తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అసత్య ఆరోపణలు మానుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ప్రచార కమిటీ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. శివ్వారం-మంథని మధ్య గోదావరినదిపై బ్రిడ్జి నిర్మించాలని మంథని ప్రాంత వ్యాపార, వాణిజ్య వర్గాల చిరకాల కోరిక మేరకు మంత్రి శ్రీధర్‌బాబు బ్రిడ్జి మంజూరు చేయించి పనులు నడిచేలా చర్యలు తీసుకున్నారన్నారు. రియల్ ఎస్టేట్ మాఫియాకు, శ్రీధర్‌బాబు బంధువులని ప్రచారం చేస్తున్న సీఎల్ రాజంకు బ్రిడ్జి నిర్మాణంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. కేవలం ప్రజా ప్రయోజనాల కోసమే శ్రీధర్‌బాబు బ్రిడ్జి నిర్మించడానికి కృషి చేశారన్నారు.

రోడ్డుపై ఇసుక లారీలతో ఇబ్బందులు

ముత్తారం ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి మానేరు నదిపై ఇసుకను తరలిస్తుండగా ఖమ్మంపల్లి, సీతంపల్లి, జిల్లాలపల్లి గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక లారీలు రోడ్డుపై నిలపడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీలతో మంథని మండలం ఎగులాస్‌పూర్ నుంచి ఖమ్మంపల్లి మానేరు శివారు వరకు రోడ్డు పూర్తి గా చెడిపోయింది. నిత్యం సుమారు 100 లారీలు నడుస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. లారీ యజమానులు డీడీలు తీసి లారీ ని ఇసుక క్వారీ వద్దకు పంపిస్తే డిడిలో ఉన్న పూర్తి నగదులో మాత్రమే ఇసుకను లారీలో లోడ్ చేసి పంపించాలి. క్వారీల వద్ద త్వరగా లోడ్ చేసినందుకు, కాంట వద్ద, ఎక్స్‌కావేటర్ వద్ద తలాకొంత నగదు లారీ డ్రైవర్‌ల వద్ద వసూలు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. సన్న ఇసుకకు డీడీ కంటే ఎక్కువ వసూలు చేస్తున్నట్లు సమాచారం. అధికారుల పర్యవేక్షణలో ఇసుక తవ్వకాలు జరిపించాలని రోడ్డుపై లారీలను నిలుపకుండా పార్కింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

కోల్‌సిటీ: పోలీసులకు పదోన్నతులతోనే గుర్తింపు, ఉత్సాహం లభిస్తుందని, పదోన్నతులతో స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. రామగుండం కమిషనరేట్‌లో కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా 51మంది పదోన్నతి పొందారు. వారికి బుధవారం కమిషనర్ పదోన్నతి చిహ్నలను అలంకరించారు.

సుల్తానాబాద్: వేసవిలో కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తామని ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఈ మాధవరావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని మండల పరిషత్ క్వార్టర్స్‌లో ఏడీఈ, ఏఈ కార్యాలయాన్ని బుధవారం ఎస్ఈ ప్రారంభించారు.

కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో బుధవారం అంగన్వాడీ సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా మహిళా సాధికారిక కేంద్ర, రాష్ట్ర కోఆర్డినేటర్ దయ అరుణ మాట్లాడుతూ లేబర్ కార్డు, సుకన్య సమృద్ధియోజన, సురక్షబీమా యోజన, అట ల్‌పెన్షన్ యోజన, జీవనజ్యోతియోజన, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

పెద్దపల్లి రూరల్ : చనిపోయిన కోళ్లను కోళ్ల ఫాం యజమానులు పొలాల మధ్య పడేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని నిట్టూరు గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెంది కల్లెపల్లి అశోక్‌ను సీపీఎం రాష్ట్ర నాయకులు భూపాల్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావులు గురువారం అశోక్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. నాయకులు మోదుంపల్లి శ్రావణ్, తాండ్ర అంజి, నవీన్ ఉన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీని ఈ నెల 4న నియమిస్తున్నట్లు ఎస్సీ, బీసీ కులసంఘాల నాయకులు తెలిపారు. మాజీ సర్పంచ్ కొప్పుల మహేష్, మాను మండ్ల శ్రీనివాస్, రేచవేని సతీష్, మాను మండ్ల సంపత్, మోదుంపల్లి రాజు, మల్లెత్తుల కనుకయ్య ఉన్నారు.

పెద్దపల్లిటౌన్: క్లిష్టమైన పరిస్థితిలో ఉన్న ఒక మహిళకు అత్యవసర చికిత్స అందించి వైద్యులు ప్రాణాలు కాపాడారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలపల్లి మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన ఓ మహిళ కడుపునొప్పితో బాధపడుతూ స్థానిక పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ హస్ప టల్‌లో చికిత్స నిమిత్తం బుధవారం సాయంత్రం చేరారని సకాలంలో స్పందించి మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడారని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులను అభినందించారు.

కోల్‌సిటీటౌన్: విద్యార్థులు సెలవులను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవతరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిశేఖర్, పాఠశాల ఇంచార్జి హెచ్ఎం సమీర్, ఉపాధ్యాయులు జగదీశ్వర్, ప్రేమ్‌కుమార్‌పాల్గొన్నారు.

మంథని : శ్రీరామ నవమి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ సంస్థ ద్వారా భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను హోం డెలివరీ చేస్తున్నట్లు మంథని డీఎం శ్రావణ్‌కుమార్ బుధవారం తెలిపారు.

రామగిరి : రాష్ట్రంలో అందించే సన్న బియ్యం పథకం కేంద్ర సర్కార్ పథకమేనని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

కళ్యాణ్‌నగర్: హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలంటూ బుధవారం గోదావరిఖని చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, నాయకులు వేల్పుల కుమారస్వామి, రామాచారి, మేదరి సారయ్య, బిక్షపతి, గణేష్ పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని రమేష్ నగర్‌లోని వాసవ్య విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు ఘనంగా స్నాతకోత్సవం నిర్వహించారు.